ప్రజాశక్తి
శనివారం 30 నవంబర్ 2024 5 అనంతపురం

హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - బొమ్మనహాల్

మండలంలోని నేమకల్లు గ్రామంలో శనివారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని హెలిప్యాడ్ స్థలాన్ని, నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని, నేమకల్లులో గ్రామసభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించిన వారు అక్కడి ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ గ్రామంలో పర్యటిస్తున్న నేపథ్యంలో గ్రామాభివృద్ధికి, అభివృద్ధి పనులను సిఎం ప్రకటించే అవకాశం ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ నేమకల్ గ్రామ రూపురేఖలు ఇప్పటికే మారాయని రాబోవు రోజుల్లో ప్రజల ఆశలు ఆలోచనలకు అనుకూలంగా ముఖ్యమంత్రి వరాలు ఇస్తారని ఆశాభావం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ష్.. ఎక్కడి వారక్కడే గప్‌చుప్ ...

నగరపాలికలో హెచ్చుమీరిన అక్రమాలు

ఇంజినీరింగ్ విభాగంలో అధికారుల అడ్డగోలు పనులు

తప్పులు చేస్తున్నా సరిదిద్దే వారు కరువు

అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపాలిటీలో తప్పులపై తప్పులు చేస్తున్నా వాటిని సరిదిద్దే వారు లేకపోవడంతో ఎక్కడి దొంగలు అక్కడే గప్ చిప్ అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ అధికారుల స్థాయిలో కిందిస్థాయి సిబ్బంది ఉద్యోగులు చేసే పొరపాట్లను సరిదిద్ది ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రగతి పథంలో నడపాల్సిన అధికారులే అడ్డగోలు వ్యవహారాలు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో వినపడుతున్నాయి.

సాధారణంగా పనుల నిర్వహణ టెండర్లు నిర్వహించిన తర్వాత జరుగుతుంది. పనికి సంబంధించి టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అగ్రిమెంటు వర్కర్ ఆర్డర్ ఇచ్చిన తర్వాతనే పనులు ప్రారంభిస్తారు, అయితే ఇవేవీ ఈ పద్ధతులు పాటించకుండా అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన తర్వాత టెండర్లను నిర్వహించే పద్ధతులకు ఇక్కడ నాందిపలికారని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇలాంటి పద్ధతులు వలన అక్రమాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇదే మాదిరిగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక ముఖ్య నేత ఇంటిముందు సిమెంట్ రోడ్డును టెండర్లు పిలవకనే చేపట్టి అప్పటి ఎగ్జిక్యూటివ్ అథారిటీ నిర్వాకంతో పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం ఆరేడు సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. టెండర్లు నిర్వహించకనే పనులు చేపట్టడంతో ఎం బుక్కును సైతం రికార్డు చేయకుండా నిలిపివేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం అండ చూసుకొని పనులు చేసిన కాంట్రాక్టర్ నోట్లో వేలు పెట్టుకుని లక్షలాది రూపాయలు బిల్లులకై ఏడు సంవత్సరాలు ఎదురు చూడాల్సి వచ్చింది. అదే ఎగ్జిక్యూటివ్ అథారిటీ అదే ముఖ్యనేతకు సంబంధించి పొరుగున మున్సిపాలిటీలో టెండర్ లేకుండానే పనులు చేయించి ఆ నియోజకవర్గ ముఖ్య నేత చీత్కారాలకు గురై అక్కడ నుంచి బదిలీ చేయించుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది ప్రస్తుతం అదే బాటలో కొందరు ఎగ్జిక్యూటివ్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. నిబంధన ప్రకారం అర్హత కలిగిన వారికి టెండరు దక్కకుండా చేయడానికి అనర్హులను ఎంపిక చేసి వారికి టెండర్లు కట్టబెట్టాలన్న స్థాయికి దిగజారడాన్ని బట్టి చూస్తే కాసుల కోసం ఎంతటికైనా దిగజారుతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సెప్టెంబర్ నెలలో నిర్వహించిన థర్డ్ పార్టీ కంట్రోల్ టెస్ట్ తెరవాల్సి ఉంది. ఇందులో టెండర్ నిబంధన ప్రకారం టెండర్ దారులు ఒకరికే అర్హత ఉన్నట్లు తెలియవచ్చింది. అయితే అర్హత కలిగిన వారి కన్నా అనర్హులకే టెండర్ దక్కేలా చూడటానికి ఫస్ట్ టెండర్ షెడ్యూల్ లోని నిబంధనను మార్చివేసి రెండోసారి ఎక్స్‌టెన్షన్ ఆఫ్ ఇంట్రెస్ట్ టెండరును గుట్టు చప్పుడు కాకుండా ప్రచురణకు కేటాయించినట్లు సమాచారం. మొదటిసారి టెండర్లు షెడ్యూల్లో కనబరిచిన నిబంధనలను దక్కేలా చూడటానికి సివిల్ వర్క్స్ లో సీనియారిటీ ప్రాతిపదికను ఐదు సంవత్సరాలకు కుదించారు. సాధారణంగా 10 సంవత్సరాల అర్హత కలిగిన వారికే టెండర్‌లో పాల్గొనే అర్హత ఉంది. అయితే పది సంవత్సరాల అనుభవం లేకున్నా కేవలం తమకు అనుకూలంగా ఉంటారన్న కారణంగా కాసుల కక్కుర్తితో నిబంధనలను కుదించి వేశారన్న చర్చ ఉద్యోగ వర్గాలలో నడుస్తోంది. ఇందుకు గల ప్రధాన కారణం ఇంతకు ముందు వీరు పని చేసిన మున్సిపల్ కార్పొరేషన్ లో వీరికి ఈ అధికారులకు సన్నిహితులు కావటమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండవసారి టెండరులో సూపరిండెంట్ ఇంజనీర్ ప్రమేయం ఎక్కడా లేకుండా చూడటంలో ఎగ్జిక్యూటివ్ అథారిటీలు సఫలీకృతులయ్యారని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దీనికి తగ్గట్టు వీరి అవినీతి అక్రమాలకు వ్యతిరేకించే వ్యక్తి ఇంజనీరింగ్ అధికారి కావటంతో ఆయన ప్రమేయం లేకుండానే ఈ తతంగాన్ని ఎగ్జిక్యూటివ్ అథారిటీలు నడిపారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మొదటిసారి పిలిచిన టెండర్‌లో సూపరెండెంట్ ఇంజనీరింగ్ సూర్యనారాయణ పేరు, టెక్నికల్ ఆఫీసర్ రామ్మోహన్ పేరు వారి ఫోన్ నెంబర్లతో సహా కాంటాక్ట్ చేయాలని ప్రచురించారు. దీనిద్వారా సూపరిండెంట్ ఇంజనీర్ ఆధ్వర్యంలోనే టెండర్లు జరిగేలా చూడటం జరిగింది. అయితే ఆ టెండర్ బాక్స్‌ను ఓపెన్ చేయకూడదని ఓ ముఖ్య నేత మౌఖిక ఆదేశాలతోఉన్నతాధికారి మిన్నకుండిపోయినట్లు సమాచారం. అయితే రెండవసారి టెండరులో సూపరిండెంట్ ఇంజనీరింగ్ అధికారి పేరుకనపరచకపోవటం కేవలం ఎగ్జిక్యూటివ్ అథారిటీల ఫోన్ నెంబర్లు మాత్రమే పేర్లు లేకుండా ప్రచురింప చేయటం చూస్తే ఏదో మతలబు జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎగ్జిక్యూటివ్ అథారిటీల అక్రమ కార్యకలాపాలు చూస్తూ ఉండలేకనే ఆ ఉన్నతాధికారి వీఆర్ఎస్‌లోకి వెళ్తున్నారన్న వ్యాఖ్యానాలు ఉద్యోగ వర్గాల్లో వినపడుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నతాధికారిని పక్కనపెట్టి ఎగ్జిక్యూటివ్ అథారిటీలు కుమ్మక్కై వ్యవహరిస్తున్నారా అన్న సందేహం కలుగుతోంది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లోని ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలు చూస్తే అధికార యంత్రాంగం అడ్డగోలు వ్యవహారాలు జరిపే విషయంలో నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పడుతున్నాయి.

మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే అవినీతిని అరికడతామని అక్రమాలు సహించబోమని ప్రకటనలు గుప్పించే ముఖ్యనేత సైతం వీరికి కొమ్ము కాస్తున్నారా అన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలు వల్ల అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిష్ట మసకబారటమే కాక భవిష్యత్తులో జరిగే ఆడిటింగ్ అకౌంటింగ్ వ్యవహారాల్లో అధికారుల అవినీతి బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్న ఆరోపణలు వినపడుతున్నాయి. అంతేకాక లక్షలాది రూపాయల ప్రజాధనం యదేచ్ఛగా దుర్వినియోగం అయ్యేలా కార్పొరేషన్ అధికారులు వ్యవహార శైలి కనబడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే లక్షలాది రూపాయల ప్రభుత్వ ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. అటు పాలకవర్గం ఇటు ముఖ్య నేత వివిధ పార్టీలకు చెందిన వారు కావడంతో అడ్డగోలు వ్యవహారాలకు ఇంజనీరింగ్ అధికారులు తెరలేపారన్న ఆరోపణలు సైతం విన్పిస్తున్నాయి. ఇదే గనక నిజమైతే నగరంలో నాణ్యత ప్రమాణాల మేరకు జరిగే అభివృద్ధి పనులకు తిలోదకాలు ఇచ్చినట్లు అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

114 చెరువులకు సాగునీరివ్వాలి

ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలి -కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకూ సాగునీరు అందించడంతోపాటు ప్రతిఇంటికీ తాగునీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి నేతృత్వంలో శ్రీశైలం నుంచి జీడిపల్లి రిజర్వాయర్ వరకూ చేపట్టిన భగీరథ విజయయాత్ర 12ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బళ్లారి మిట్ట నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్‌డిఒ కార్యాలయం వరకూ సాగింది. ఇందులో భాగంగా టి సర్కిల్ కూడలిలో రఘువీరారెడ్డి చిత్రపటానికి కృష్ణాజలాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భగీరథ ప్రయత్నం చేసి జీడిపిల్లికి కృష్ణాజలాలు తీసుకొచ్చామన్నారు. అయితే తర్వాత కొనసాగింపులో అధికారంలోకి వచ్చిన పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని 114 చెరువులకు సాగునీరు ఇస్తామని, ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలు ఇస్తామని చెప్పిన హామీలను కేవలం కాగితాలకే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న పాలకులు స్పందించి చెరువులకు సాగునీరు, ప్రజలకు మంచినీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాప్, నాయకులు దాదాగాంధీ, వడ్డే చిన్నప్పయ్య, ప్రభాకర్, నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, తదితరులు

హామీలు నెరవేర్చే దిశగా పనిచేస్తాం

రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - అనంతపురం

ఉరవకొండ నియోజకవర్గంలో ఆయా గ్రామాలకు చెప్పిన హామీలన్నీ నెరవేర్చే దిశగా పనిచేస్తామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శుక్రవారం కూడేరు మండలం ఎం.ఎం.హళ్లి గ్రామానికి సంబంధించి నూతనంగా నిర్మించిన తారు రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎం.ఎం.హళ్లి నుంచి సిద్ధరాంపురం గ్రామానికి ఎన్ఆర్ఈజిఎస్ కింద రూ. 1.99 కోట్లతో నిర్మించిన 4.475 కిలోమీటర్ల బీటీరోడ్డును ఈసందర్భంగా మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గ్రామస్తులకు తాను రుణపడి ఉన్నానన్నారు. గ్రామంలోకి వస్తుంటే గ్రామస్తులు చూపించిన ఆదరాభిమానాలకు వెయ్యి ఏనుగుల బలం వచ్చిందని, ఇంకా 10 రెట్లు ఎక్కువగా పని చేయాలని ఉందన్నారు. ఇది మొదలు మాత్రమేనని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కూడా చెప్పిన హామీలు అన్ని నిలుపుకునే దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ప్రారంభిస్తామన్నారు. గత ఐదేళ్లపాటు నాయకులకు ఇచ్చిన అవకాశాలు వినియోగించుకోలేదని, ప్రజలకు మేలు చేసే ఒక మంచి పని చేయలేదని విమర్శించారు. తాము శాశ్వతంగా ప్రతి గ్రామానికి, ప్రతి ఎకరాకు నీరు ఇస్తామన్నారు. గ్రామానికి అవసరమైన పనులు, పరిశ్రమలతో పిల్లలకు ఉద్యోగాలు తీసుకొచ్చే రెండు ప్రధాన లక్ష్యాలను పెట్టుకుని పని చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్‌బాష, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శికి మాతృవియోగం

పరామర్శించిన సిపిఎం రెండు జిల్లాల కార్యదర్శులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

సిపిఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాతృమూర్తి గంగమ్మ గురువారం మృతిచెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న గంగమ్మ పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలోని తమ స్వగృహంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇఎస్ వెంకటేష్ , జిల్లా కమిటీ సభ్యులు దిల్షాద్ , జంగాలపల్లి పెద్దన్న , సిపిఎం జిల్లా కార్యలయ కార్యదర్శి సిద్దు , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్ , జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత , వెంకట్రాముడు , నారాయణ , కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతమ్మ , స్థానికనాయకులు హరి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





గంగమ్మ మృతదేహాన్కిఇ నివాళులు అర్పిస్తున్న నాయకులు రాంభూపాల్, హరి, ఇంతియాజ్, తదితరులు

మడకశిరలో కిరాతకం

8వ తరగతి విద్యార్థి దారుణ హత్య

మేనమామే హంతకుడు

ప్రజాశక్తి - మడకశిర

మడకశిర మండలంలో ఎనిమిదేళ్ల బాలుడికి అత్యంత కిరాతకంగా హతమార్చారు. సొంత మేనమామే అల్లుడిని అత్యంత కిరాతంగా బ్లేడుతో గొంతుకోసి హతమార్చాడు. అనంతరం తనకేమీ తెలియనట్లు బాలుడి కుటుంబసభ్యులతో కలసి తమ పిల్లవాడు కన్పించలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. అతని వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈ హత్యకు కుటుంబసమస్యలే కారణమన్నట్లు తెలుస్తోంది. బాలుడి హత్య ఈఘటనకు సంబంధించి పోలీసులు, బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు....

మడకశిర మండలంలోని డి. అచ్చంపల్లికి చెందిన పుష్పలత, వెంకటేష్ అనే దంపతుల 13 సంవత్సరాల చేతన్ సమీపంలోని అమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్లిన చేతన్‌ను అతని మేనమామ అశోక్ గురువారం పాఠశాలకు వెళ్లి తన అల్లుడు చేతన్‌ను మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి కర్నాటక ప్రాంతానికి తీసుకెళ్లాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కొందరు స్నేహితులతో కలసి చేతన్‌ను రెండు చేతులు కట్టివేసి బ్లేడుతో గొంతుకోసం హతమార్చాడు. అనంతరం తనకేమి తెలియదన్నట్లుగా ఇంటికి వచ్చి చేతన్ తల్లిదండ్రులతో కలసి తమ పిల్లవాడు కన్పించలేదని పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు అశోక్ వ్యవహరిస్తున్న వైఖరిపై అనుమానం వచ్చింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. దీంతో అశోక్ నేరం అంగీకరించాడు. తానే చేతన్‌ను కర్నాటకకు తీసుకెళ్లి చేతులు కట్టివేసి బ్లేడుతో గొంతుకోసి హత్యచేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

కుటుంబకలహాలతోనే హత్య : అచ్చంపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థి చేతన్ హత్య కుటుంబకలహాల నేపథ్యంలో జరిగిందని ఎస్పీ రత్న వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి హత్యకు కుటుంబకలహాలేనని తెలుస్తోందన్నారు.

అటవీప్రాంతంలో చేతన్ మృతదేహం, ఇన్‌సెట్‌లో (పాతచిత్రం)

మృతుడి మేనమామ అశోక్ మీద అనుమానం రావడంతో అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు నిజం బయట పడిందని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐలు రాగిరి రామయ్య, రాజకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే

8వ తరగతి విద్యార్థి చేతన్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అన్నారు. చేతన్ హత్య బాధాకరమన్నారు. నియోజకవర్గంలో ఇలాంటి దుర్మార్గపు సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలుడి హత్య కేసును 12 గంటల్లో ఛేదించిన ఎస్పీ, డీఎస్పీ, సిఐలు, పోలీసులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్

లేఅవుట్లను పరిశీలిస్తున్న అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ తెలిపారు. శనివారం అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని పలు వెంచర్లను అధికారులతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం కొనుటూరు గ్రామంలో ఎన్టీఆర్ టౌన్‌షిప్, రాప్తాడు కందుకూరు గ్రామం ఎన్టీఆర్ స్మార్ట్‌షిప్ వెంచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పేదలు పడ్డ ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అభిలాష మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎన్‌టిఆర్ టౌన్‌షిప్‌లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

కూలీలతో మాట్లాడుతున్న పుట్లూరు పోలీసులు

మీకో దండం తల్లీ..

అంతమంది వాహనాల్లో వెళ్లొద్దు..-కూలీలకు పోలీసుల అవగాహన

ప్రజాశక్తి-నార్పల

'మీకు దండం తల్లీ.. ఎంతమంది అంటే అంతమంది ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి..' అంటూ పోలీసులు వేడుకుంటున్నారు. ఇటీవల గార్లదిన్నె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది కూలీలు ఆటో ప్రమాదంలో మృత్యువాత పడటంతో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గూగూడు రోడ్డులో మామిడికాయలు కోసేందుకు కూలీలు బొలేరో వాహనంలో వెనుకవైపు కూర్చొని వెళ్తుండగా ఎఎస్‌ఐ నాగరాజు, కానిస్టేబుళ్లు అమర్, మైనుద్దీన్ గమనించారు. వెంటనే వాహనాన్ని ఆపి కూలీలను కిందికి దింపి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇలాంటి నిర్లక్ష్య ప్రయాణాలతో నిండు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. మీరు మృత్యువాత పడితే పిల్లలు, కుటుంబ సభ్యులు అనాథలు అవుతారని అవగాహన కల్పించారు. మరొకసారి ఇష్టానుసారంగా కూలీలను వాహనంలో ఎక్కించుకుంటే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని డ్రైవర్‌ను మందలించారు.

పుట్లూరు : మండల పరిధిలోని గోపురాజుపల్లి క్రాసు వద్ద అధిక లోడుతో వెళ్తున్న కూలీల ఆటోను పోలీసులు ఆపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆటోలో దాదాపు 17 మంది కూలీలు ప్రయాణం చేస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరంతా తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి నుంచి యల్లనూరు మండలం ఎం.కొండాపురానికి పనికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈనేపథ్యంలో గోపురాజుపల్లి వద్ద పోలీసులు గమనించి ఆటోను ఆపి కూలీలను కిందికి దించి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తర్వాత ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అత్యాచారం కేసులో జీవితఖైదు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పుట్లూరు మండల కేంద్రానికి చెందిన తలారి రామాంజనేయులు అలియాస్ మూగోడుకు మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో జీవిత ఖైదు, రూ.3000 జరిమాన విధిస్తూ అనంతపురం పోక్సో ట్రయల్ కేసుల కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.10.50 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈఏడాది జూలై 3న మధ్యాహ్నం పుట్లూరులో ఆరేళ్ల బాలిక తన తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లడంతో ఇంటి ముందు ఆడుకుంటోంది. ఆ సమయంలో చాక్లెట్ ఇస్తానని తలారి రామాంజనేయులు అలియాస్ మూగోడు ఆశ చూపి తన ఇంట్లోకి తీసికెళ్లి బాలికపై అత్యాచారం చేసినట్లు బాధితురాలి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి పుట్లూరు ఎస్ఐ యు.వెంకటప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి తాడిపత్రి డీఎస్పీలు ఎ.శ్రీనివాసులు, బి.వెంకట శివారెడ్డి కేసును దర్యాప్తు చేసి అనంతరం నిందితున్ని పోక్సో ట్రయల్ కేసుల స్పెషల్ సెషన్స్ జడ్జి ముందు హాజరుపరిచారు. ఈ కేసులో సాక్షులను విచారించిన జడ్జి రాజ్యలక్ష్మి నేరం రుజువైనందున శుక్రవారం నిందితుడికి జీవిత ఖైదు, రూ.3000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలకు రూ.10.50 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్నిఆదేశించారు. ఈ కేసును స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ ఎస్డీపీఓ, వెంకటేశ్వర్లు, సీఐ వెంకటేష్‌నాయక్, పుట్లూరు సిఐ సత్యబాబు, సీఎంఎస్. ఎస్ఐ రామాంజనేయుల పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్.శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ నాగార్జున, పుట్లూరు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య ఆయా సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచి, నిందితుడికి శిక్ష పడేందుకు తమ వంతు కృషి చేశారు. జిల్లా ఎస్పీ వీరందర్నీ అభినందించారు.

రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రిరూరల్

ఆరుతడి భూముల రైతులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేసి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో సిఎం చంద్రబాబు జిల్లా పర్యటనలో ఇచ్చి హామీ మేరకు జిల్లాలోని ఆరుతడి భూముల రైతులకు పదెకరాకు వెసులుబాటు కల్పించాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం మూడెకరాల వరకే పరిమితం చేస్తూ తెచ్చిన జీవోను సవరించాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో ఆయకట్టు కింద ఉన్న భూములకు ఆరుతడి భూములుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. పేరుకు ఆరుతడి భూముల రైతులేగానీ, వారికి పూర్తిస్థాయిలో నీరు అంది పంటలు పండిన పాపానపోలేదన్నారు. తాడిపత్రి, తదితర మండలాల్లో బ్రాంచ్ ఆయకట్టు కింద ఉన్న భూములకు ఎప్పటి నుంచో నీరు అందడం లేదన్నారు. కావున తెలుగుదేశం ప్రభుత్వం ఆరుతడి భూములు ఉన్న రైతులకు 10 ఎకరాల వరకూ భూమి ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు.

ఉర్దూ హైస్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి-కణేకల్లు

ఉర్దూ హైస్కూల్ ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

మండల కేంద్రంలో రూ.1.15 కోట్లతో నూతనంగా నిర్మించిన ఉర్దూ హైస్కూల్‌ను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహంతుల్లా అధ్యక్షన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విప్ మాట్లాడుతూ మండల కేంద్రంలో అధికంగా ముస్లిములు ఉండడంతో ఉర్దూ మీడియం హైస్కూల్ ఎంతో అవసరమని గుర్తించామన్నారు. ఇందులో భాగంగానే పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు కూడా శ్రద్ధ వహించి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ప్రసాద్‌బాబు, ఎంఇఒలు లక్ష్మన్న, భవానీశంకర్, ఎంపిడిఒ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, మండల కన్వీనర్ లాలప్ప, ఆనంద్ రాజ్, రమేష్, చంద్ర, ముజ్జు, సుదర్శన్, సలీం, చాంద్‌బాషా, అబ్దుల్, మహబూబ్‌రహీం, సక్లైన్ షేక్ హుస్సేన్, జిన్నాబాబు, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

ధర్మకర్త శ్రీకాంత్, అధ్యక్షులు జివి.రామన్, కార్యదర్శి రంగయ్య

ప్రజాశక్తి-గుత్తి

విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి, మాణిక్య రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షులు జివి.రామన్, కార్యదర్శి అశ్వర్థ రంగయ్య అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం సాయంత్రం రంగనాథ స్వామి ఆలయంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ రూ.36 లక్షలతో షెడ్డు, స్నానపు గదులు, మరుగుదొడ్లను నిర్మించామన్నారు. ప్రహరీ, పూలతోట, తులసివనం ఏర్పాటు చేశామన్నారు. రూ.1.90 కోట్ల వ్యయంతో కొండపై ఉన్న రంగనాథ స్వామి పుట్టుశిల వరకూ సిసి రహదారి, మెటికలు, ప్రహరీ నిర్మించామన్నారు. సత్రం ఆధునీకరణ, పెద్ద రేకుల షెడ్డు ఏర్పాటు చేశామన్నారు. కొండపైకి తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతిఏటా స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ప్రసాదం, సమారాధన, ఆలయంలో పుష్పాల అలంకరణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాణిక్య రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ కన్‌స్ట్రక్షన్ కార్యదర్శి రామరంగయ్య, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం

ప్రజాశక్తి-అనంతపురం

రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్న జెఎల్

టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు శుక్రవారం నగరంలోని పాతూరులో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదానం చేశారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న వినాయకుని ఆలయం వద్ద టెంకాయలు కొట్టారు. అర్బన్ బ్యాంకు పాలకవర్గ సభ్యులు బ్యాంకు ప్రాంగణంలో అన్నదానం చేశారు. సాయంత్రం నగరంలోని పొట్టి శ్రీరాములు హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యాసామగ్రి, మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మురళీధర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, నాయకులు ఆదినారాయణ, గంగారాం, కూచి హరి, సద్దల చెన్నప్ప, లచ్చి, జె.వెంకటాద్రి, సుంకర రమేష్, కృష్ణకుమార్, బి.రమణయ్య, జె.రామాంజనేయులు, ఎం.చంద్రశేఖర్, రోళ్ల భాస్కర్, సి.భాస్కర్, ఎన్‌బికె శ్రీధర్, మధుసూదన్‌గౌడ్, అనిల్‌నాయుడు, సునీల్‌రాయల్, అంకే గంగాద్రి, అక్కులు యాదవ్, శైలు పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని శ్రీనివాసపురం ఎస్ఎస్ఎంఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్.మాధవయ్య, జన విజ్ఞాన వేదిక తాడిపత్రి శాఖ ఆధ్వర్యంలో సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించంచారు. ఇందులో భాగంగా జెవివి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి వై.హరేరామ్ తన మ్యాజిక్ షో నిర్వహించారు. తర్వాత ఎల్.వెంకటసుబ్బయ్య, ఎం.సుబ్బరాయుడు జెవివి పాటలను పాడి విద్యార్థులకు వినిపించారు. అనంతరం జెవివి జాతీయ ఉపాధ్యక్షులు ఎవి.రమణయ్య సామాజిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు చేతు రామేశ్వర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎమ్మెల్యే దగ్గుపాటి చొరవతో మున్సిపల్ కార్మికులకు పనిముట్లు అందజేశారు. గతంలో మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన సమయంలో కార్మికులు తమకు పనిముట్లు ఇవ్వాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి కార్మికులకు పనిముట్లు మంజూరు చేయించారు. దీంతో కార్మికులకు పరకలు, గంపలు, ఇతర పనిముట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై సమావేశం

ప్రజాశక్తి-యల్లనూరు

వచ్చేనెల 8న జరగనున్న సాగునీటి ఎన్నికలపై శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎఇలు, పిఇలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజా మాట్లాడుతూ డిసెంబర్ 8న డబ్ల్యూఎఇల పరిధిలో జరగనున్న సాగునీటి ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. దీనికితోడు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎన్నికలు జరిగేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, మండల విస్తరణ అధికారి మనోహర్‌బాబు, మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, ఎపిఎం ముత్యాలప్ప, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావు, ఆర్ఐ నారాయణమ్మ, హౌసింగ్ ఎఇ సుప్రజ, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చౌకధాన్యం యంత్రాలు రెన్యువల్

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పౌర సరఫరా చౌకధాన్యం దుకాణాల్లోని తూనికల యంత్రాలకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో సీల్ వేసి రెన్యూవల్ చేశారు. ఈ సందర్భంగా తునికలు, కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ సంవత్సరానికి సంబంధించి చలానా రూ.900 కట్టించుకుని రెన్యూవల్ చేసినట్లు తెలిపారు. సుమారు 36 షాపుల యంత్రాలను రెన్యూవల్ చేసినట్లు వివరించారు.

GUNTAKAL MUNICIPALITY
e procurement Tender Notice

S.No	e-Tender Notice No	No of works	Estimate Cost in lakhs
1	17/2024-25/GENERAL FUNDS /E3 dated : 29.11.2024 short tender	1	Rs. 1.98

Further details can been seen at e-procurement market place i.e.. www.tender.apeprocurement.gov.in
Sd/- Commissioner
Guntakal Municipality

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య పిలుపునిచ్చారు. యూట్యూబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలో ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ రాంనరేష్ ఫంక్షన్ హాల్, విద్యుత్ సర్కిల్ కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చేనెల 1వతేదీన రాయదుర్గంలో జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల సందర్భంగా భవిష్యత్తు కర్తవ్యాలపై చర్చించి ఆమోదం తీసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయుల కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జీవో 117ను రద్దు చేయాలని, డిఎ, పిఆర్‌సి, ఎపిజిఎల్ఐసి బకాయిలు, అపార్ ఒత్తిడి, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం బుక్కరాయసముద్రం మండల గౌరవాధ్యక్షులుగా విహెచ్.శ్రీమార్క్, అధ్యక్షులుగా బి.మహమ్మద్‌గౌస్, మండల ప్రధాన కార్యదర్శి సి.పవన్‌కుమార్, సహాధ్యక్షులుగా శివప్రసాద్, అనురాధ, కోశాధికారిగా బాబురావు, జిల్లా మహాసభ ప్రతినిధులుగా సీతారామరెడ్డి, సుబ్బరాయుడు, కార్యదర్శులుగా దివాకర్‌రెడ్డి, పుల్లన్న, లక్ష్మీనారాయణ, వన్నప్ప, అరుణ, మేరీ, తదితరులను ఎన్నుకున్నారు.

రాప్తాడు : ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ఏర్పాటై 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని రాయదుర్గం ప్రభుత్వ కళాశాలలో స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున స్వర్ణోత్సవ మహాసభలకు భారీఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బికె.నారాయణ, అధ్యక్షులుగా బి.గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటనాయుడు, సహాధ్యక్షులు సి.చంద్రారెడ్డి, కె.కవిత, కోశాధికారి పి.రాజకుల్లాయప్ప, కార్యదర్శి ఎ.సదాసాంబశివుడు, సి.సంజీవకుమార్, ఎన్.గాయత్రి ఇ.నబిరసూల్, జిల్లా కార్యదర్శి బిజి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ముద్దలాపురం వాటర్‌ప్లాంట్ ట్రయల్‌రన్

ముద్దలాపురం వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురానికి తాగునీరు సరఫరా చేసే ముద్దలాపురం వాటర్‌ప్లాంట్ వద్ద శుక్రవారం 16 ఎంఎల్‌డి ప్లాంట్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఇందులోఉ భాగంగా ప్లాంట్ నిర్మాణ పనులు, నీటిశుద్ధి తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 61ఎంఎల్‌డికి అదనంగా 16ఎంఎల్‌డి ప్లాంట్‌ను మంజూరు చేశారన్నారు. ఇందుకోసం రూ.16కోట్లతో పనులు చేపట్టారన్నారు. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదునెలల్లోనే ఆయా పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం 23 డివిజన్లకు రోజూ తాగునీరు అందుతోందని, మరో 27 డివిజన్లకు రోజు మార్చి రోజు తాగునీరు వస్తోందన్నారు. ఇక నుంచి ప్రతి డివిజన్‌లో రోజూ తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఇంజినీరింగ్ అధికారులు నరసింహా, రాధాకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, తలారి ఆదినారాయణ, నాయకులు సరిపూటి రమణ, గుర్రం నాగభూషణ, పావురాల శేఖర్, సాకే లక్ష్మీనరసింహా, పిఎల్ఎన్ మూర్తి, కూచి హరి, నలబోలు మధు రాయల్, తొండపునాటి రమేష్‌బాబు, జోగి రాజేంద్ర, నెట్టెం బాలకృష్ణ, బండి కాశీ విశ్వనాథ్, తమ్మినేని వేణు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రిప్పు పరికరాలను సద్వినియోగం చేసుకోండి

ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లావ్యాప్తంగా రైతులు సబ్సిడీతో పంపిణీ చేసే డ్రిప్పు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రఘునాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. 2024–25 సంవత్సరానికి 37,500 హెక్టార్లు ప్రభుత్వ లక్ష్యంగా తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్‌లో మైక్రో ఇరిగేషన్‌కు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం సంక్షోభం నుంచి అభివృద్ధి వైపుగా ఎపిఎంఐపి అడుగులు వేస్తోందన్నారు. జిల్లాలో అత్యధికంగా కళ్యాణదుర్గం ప్రాంతంలో 3000 (హెక్టార్లలో), బుక్కరాయసముద్రం 2250, కూడేరు 2100, నార్పల 2000, పుట్లూరు 2100 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉన్న బకాయిలను చెల్లించే దిశలోనూ అడుగులు వేస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా 31 మండలాల పరిధిలో ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం, ఐదు నుంచి పదెకరాల్లోపు ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు వివరించారు. ఇదేక్రమంలో స్ప్రింక్లర్లకు ఐదెకరాల్లోపు 55 శాతం, ఐదు నుంచి 12.5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 45 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు చెప్పారు. కావున జిల్లాలోని రైతులు ఎపిఎంఐపి మైక్రో ఇరిగేషన్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.తిమ్మారెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

ధర్నాలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ఎం.తిమ్మారెడ్డి

పట్టణంలో ప్రయివేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న దోపిడీని దోపిడీని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.తిమ్మారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చే పేదలను వైద్యులు రకరకాల పరీక్షల రూపంలో నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రుల యాజమాన్యాలు కుమ్మక్కై మెడికల్ మాఫియాగా మారారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రాత్రిపూట అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారిని వెంటనే చేర్చుకోకపోతే అలాంటి ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో అర్హులైన నర్సులను నియమించుకోవడం లేదన్నారు. సంబంధిత జిల్లా వైద్యాధికారులు ప్రయివేట్ ఆసుపత్రులపై దృష్టి సారించి నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుల్బరోష్ జిలాన్, ఇస్మాయిల్, సాదిక్, శర్మాస్, తాహర్, బోయ చంద్రశేఖర్, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

138 మందికి ఐటి ఉద్యోగాలు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం సమీపంలో ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 138 మంది విద్యార్థులు గ్లోబల్ ఐటీ శాఖ కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్లు కరస్పాండెంట్ ఆలూరు సాంబ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ గ్లోబల్ ఐటి సేవల కంపెనీలలో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో 2025 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్‌కు చెందిన 138 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ బృందం కృషి, అంకితభావానికి ఈ ఉద్యోగాలు నిదర్శనమన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి ఎం.రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ టిసిఎస్ నుంచి వచ్చిన అఖండమైన స్పందన, విద్యార్థులకు అందించిన అధికసంఖ్యలో ఆఫర్లు విద్యార్థుల సామర్థ్యాలను తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, పాల్గొన్నారు.

పరిశోధనల ఉపయోగాలను తెలుసుకోవాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అగ్రికల్చర్ విద్యార్థులు నూతన పరిశోధనలు చేయడంతోపాటు వాటి ప్రయోజనాలను తెలుసుకోవాలని రెడ్డిపల్లి కెవికె ప్రోగ్రాం డైరెక్టర్ ఎస్–ఎస్.మల్లేశ్వరి సూచించారు. ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, మార్కాపురం ఎస్‌బివిఆర్ అగ్రికల్చరల్ కళాశాల విద్యార్థుల చదువులో భాగంగా శుక్రవారం శింగనమల మండల పరిధిలని సోదనపల్లి, సలకంచెరువు గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లేశ్వరి మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రతి విద్యార్థి నూతన పరిశోధనలు చేసి, వాటి ప్రయోగాలను తెలుసుకుని రైతులకు వివరించాలన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి కొత్త వంగడాలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జి.నారాయణస్వామి, కెసి నటరాజ్, కెవికె జి.త్రికల మాధవి, రమ్య, సఖిత, సాహితీ, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

అతిథి గృహం నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-గుత్తి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

మండలంలోని బాచుపల్లి గ్రామ సమీపంలో బాట సుంకలమ్మ ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న అతిథి గృహ నిర్మాణానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ శుక్రవారం భూమిపూజ చేశారు. బాట సుంకులమ్మ ఆలయ దర్శనానికి వచ్చే అతిథుల విశ్రాంతి కోసం కమిటీ ఆధ్వర్యంలో గృహాన్ని నిర్మించనున్నారు. ముందుగా ఎమ్మెల్యే, తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు గుమ్మనూరు నారాయణ కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.ప్రభాకర్, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, ఎంకె.చౌదరి, సర్పంచి యు.రామలింగమయ్య, మాజీ సర్పంచులు నరసింహులు, వెంకటరాముడు, శ్రీనివాసచౌదరి, నాయకులు రంగస్వామి నాయుడు, మోడే శ్రీనివాస్ యాదవ్, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, బి.రమేష్, సొలమన్‌రాజ్, పి.రవితేజ, బోర్‌వెల్ నాగరాజు, పి.సుధాకర్, పి.కృష్ణయ్య, నంద్యాల రమేష్, ఎం.నాగరాజు, బండల ప్రసాద్, టి.సుధాకర్, మాతంగి రాము, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-నార్పల

అనారోగ్యంతో బాధపడుతూ కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి సీనియర్ కార్యకర్త గొల్లపల్లి పోతులయ్యకు బొందలవాడ శివకృష్ణచౌదరి బృందం శుక్రవారం ఆర్థికసాయం అందజేసింది. పోతులయ్య చికిత్స పొందుతున్నట్లు శివకృష్ణచౌదరి ట్రస్టు బృందం శివకృష్ణచౌదరికి ఫోన్ చేసి తెలియజేయడంతో స్పందించిన ఆయన వెంటనే రూ.20వేల ఆర్థికసాయం అందించడంతోపాటు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో బండ్లపల్లి శేషానందరెడ్డి, సిద్దరాచెర్ల నాగభూషణ పాల్గొన్నారు.

సుబ్బరాయుడుసాగర్ పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని సుబ్బరాయుడు సాగర్‌ను ఇరిగేషన్ ఎస్‌సి రాజశేఖర్ శుక్రవారం పరిశీలించారు. సాగర్‌కు 8.5 మీటర్ల ఎత్తు నీరు రావడంతో రెండు, మూడు రోజుల్లో పుట్లూరు చెరువుకు నీరు విడుదల చేయాలని హెచ్చెల్సీ అధికారులకు ఎమ్మెల్యే సూచించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇరిగేషన్ ఎస్‌సి రాజశేఖర్ సుబ్బరాయుడు సాగర్‌ను పరిశీలించారు. అక్కడ నుంచి తుంపెర డీప్ కట్ వరకు నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ జెఇఇలు, డిఇ, రైతులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్కే చెన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటరాముడు, రాజకుమార్, జనార్దన్‌రెడ్డి, వీరయ్య, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పయ్యావులను కలిసిన అహుడా ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను శుక్రవారం ఆయన స్వగృహంలో అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. తర్వాత జిల్లా అభివృద్ధిపై చర్చించారు. అలాగే తన విజయానికి సహకరించిన జనసేన నాయకులు, కార్యకర్తలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

పీఠాధిపతిని కలిసిన 'అనంత' ఎంపీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిలో ఉన్న వాల్మీకి మహర్షి పీఠాధిపతి, రాజ్యసభ సభ్యులు బాలయోగి ఉమేష్‌నాథ్‌ను వారి క్యాంప్ కార్యాలయంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. తర్వాత వాల్మీకుల ఎస్టీ హోదాపై చర్చించారు. తమవంతు సాయంగా త్వరలో హోంమంత్రి అమిత్‌షాను కలిసి వాల్మీకులను ఎస్టీ హోదాలో చేర్చేందుకు కృషి చేస్తామని ఉమేష్‌నాథ్ హామీ ఇచ్చారు.

పంట కాలుష్యానికి పరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలోని డి.హీరేహాల్, బొమ్మనహాల్ మండలాల్లోని స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలు, కంకర క్రషర్ల వల్ల కలిగే వాతావరణ కాలుష్యంతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డి.హీరేహాల్ సిపిఎం మండల కార్యదర్శి లోకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయా మండలాల్లో క్రషర్లు, కంకర క్వారీలు, ఇనుము కర్మాగారాల వల్ల పరిసరాల్లోని పొలాలు కాలుష్యంతో నిండి రైతులు పంటలను పూర్తిగా నష్టపోతున్నారన్నారు. అంతేగాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం వాతావరణ కాలుష్యంలో శ్వాసకోశ వ్యాధులకు గురువుతున్నట్లు తెలిపారు. కావున ఆయా ప్రాంలాల రైతులు, ప్రజలను కాపాడాలని కోరారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులో చికిత్స తీసుకుంటూ ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోగా సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు ఐదుగురు అనారోగ్యంతో బాధపడుతూ సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.8.28లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని డి.కొండాపురం గ్రామానికి చెందిన వెంకటేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కును విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం తన నివాసంలో అందజేశారు. వెంకటేష్‌కు సిఎం సహాయ నిధి నుంచి రూ.1,45,318 చెక్కు రావడంతో బాధితుడికి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రావణిశ్రీని కలిసిన నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని శుక్రవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎపి నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపిలో బడుగు, బలహీన వర్గాలకు ఎప్పుడూ పెద్దపీట ఉంటుందన్నారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలు, నాయకులను గుర్తించి గౌరవం ఇవ్వడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు కాయల సురేష్‌యాదవ్, డీలర్లు కె.సత్యనారాయణ, మసూద్‌వలి, నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు వెంకటప్ప, తాడిమర్రి సురేంద్ర, చితంబరప్ప, సోమనపల్లి ప్రసాద్, కడియాల ఆనంద్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఎఎస్ఐగా ఉద్యోగోన్నతి

శింగనమల : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిమ్మరాజులుకు ఎఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్‌చంద్రతోపాటు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మరాజులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నారులకు స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ కె.రాజేంద్ర ఆధ్వర్యంలో చిన్నారులకు శుక్రవారం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్య విషయాలపై పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో భాగంగా పుట్టుకతో లోపాలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి తదుపరి చికిత్స కోసం సిహెచ్‌సి, ఎహెచ్, డిఇఐసిలకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్తాఫీసర్ ప్రమీలాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ మునెమ్మ, హెల్త్ అసిస్టెంట్ నూర్‌మహమ్మద్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

తహశీల్దార్ కార్యాలయంలో సేవల చార్టు ఏర్పాటు

ప్రజాశక్తి-యల్లనూరు



అధికారులు ఏర్పాటు చేసిన చార్ట్

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో 100 సేవల ఛార్ట్‌ను అధికారులు శుక్రవారం ఏర్పాటు చేశారు. గత బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో 100 సేవల ఛార్ట్ కనిపించడంలేదనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన అధికారులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఛార్ట్ ఏర్పాటు చేశారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలి మృతి

మృతిచెందిన వృద్ధురాలు

బుక్కరాయసముద్రం : గుర్తు తెలియని వృద్ధ మహిళ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతిచెందిన వృద్ధురాలి వయస్సు సుమారు 70 నుంచి 75 సంవత్సరాలు ఉంటుందన్నారు. సాయంత్రం ముసలమ్మ కట్ట వద్ద చనిపోయి ఉన్న వృద్ధురాలిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వృద్ధురాలి సమాచారం తెలిస్తే మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కరుణాకర్ తెలిపారు.

ఐచర్ బోల్తా..

రాప్తాడు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఐచర్ వాహనం శుక్రవారం తెల్లవారుజామున బోల్తా పడింది. మహారాష్ట్రకు చెందిన ఐచర్ వాహనం కమలా పండ్ల లోడుతో బెంగళూరు వైపు వెళ్తుండగా మండల పరిధిలోని కియా కంపెనీకి కొంతదూరంలో హైవే పక్కన బోల్తా పడింది. ఇందులో ఉన్న ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు స్థానిక ఆసుపత్రికి తరలించారు.